కీరా దోసకాయలు



కీరా దోసకాయలు

మూల రచయిత: నికోలాయ్ నొసోవ్

బొమ్మలు: ఇవాన్ సెమ్యునోవ్

అనువాదం: అనిల్ బత్తుల

అనగనగా రష్యా దేశంలోని ఒక ఊరిలో ఇద్దరు స్నేహితులు ఉండేవారు. ఒకరి పేరు పావ్లిక్, మరొకరి పేరు కోల్యా. ఒకరోజు పావ్లిక్ తన స్నేహితుడు కోల్యాను చేపలు పట్టడానికి తీసుకెళ్లాడు. వారికి అస్సలు అదృష్టం లేదు, రోజంతా గెలమేసి కూర్చున్నా ఒక్క చేపా చిక్కలేదు. ఇంటికి తిరిగివెళ్తూ సామూహిక వ్యవసాయ క్షేత్రంలోని కూరగాయల తోటలో కొన్ని కీరా దోసకాయలు తెంపి, జేబుల్లో నింపుకున్నారు. వీళ్ళ అలికిడిని గమనించిన తోటకాపలాదారుడు పికిలీ ఊదాడు. పిల్లలు వేగంగా పరిగెత్తి తప్పించుకున్నారు. వారు నడుచుకుంటూ వెళుతుండగా, పావ్లిక్ మనసులో ఇలా అనిపించింది. " ఈ దొంగిలించిన కీరా దోసకాయలను ఇంటికి తీసుకెళితే అమ్మ తిడుతుంది, కొడుతుంది". ఇలా ఆలోచించిన పావ్లిక్ తన కీరా దోసకాయల్ని కూడా కోల్యాకి ఇచ్చేశాడు.

"నేను తెచ్చిన కీరా దోసకాయలు చూడు!" కోల్యా అరిచాడు
తలుపు తెరిచాడు. అతని తల్లి తలఎత్తి చూసింది. అతని జేబులు, చొక్కా ఉబ్బిపోయి వున్నాయి. వాటి నుండి కీరా దోసకాయలు బయటకు కనిపిస్తున్నాయి.
"ఎక్కడివి యివి?" అమ్మ అడిగింది.
"తోటలోవి"
"ఏ తోట?"
"నది దగ్గర వున్న పెద్ద తోట, సమిష్టి వ్యవసాయ క్షేత్రం." అన్నాడు పిల్లాడు.

"దొంగతనం చేసావా?" అడిగింది అమ్మ.
"లేదు, అవి తీగలకు పెరిగాయి, కోసుకొచ్చాను" అంటూ జేబులోనుండి బయటకు తీయబోయాడు.
"ఆగు! వద్దు, ఎక్కడ నుండి తెచ్చావో అక్కడే పెట్టేసి రా " అంది అమ్మ.
"అయితే, నేను వాటిని పడేస్తాను" అన్నాడు .
"అరెరే, మీరు ఆ కీరా దోసకాయ మొక్కలు నాటలేదు. నీరు పెట్టలేదు. వాటిని పెంచలేదు. కాబట్టి ఆ కాయల్ని పడేసే హక్కు మీకు లేదు." అంది అమ్మ.

"ఆ తోటకాపలాదారుడు మమ్మల్ని చూసి పికిలి ఊదాడు. మేము పారిపోయాము."
"అతను మిమ్మల్ని పట్టుకుని ఉంటే?"
"అతను ముసలాయన, వేగంగా పరుగెత్తలేడు."
"నువ్వు, నీ స్నేహితుడు దొంగతనం చేసినందుకు సిగ్గుపడాలి. ఆ దోసకాయలు తగ్గాయని తెలిస్తే , ఆ ముసలి కాపలాదారుడు భాద్యత వహించాల్సి వుంటుంది, ఇప్పుడే వెళ్ళి వీటిని ఆయనకు తిరిగి ఇచ్చెయ్యి" అంది అమ్మ.

"అమ్మో! నేను వెళ్ళను, అతని వద్ద తుపాకీ వుంది, నన్ను కాల్చేస్తాడు" అని బాలుడు భయపడుతూ అన్నాడు.
"దానికి నువ్వు అర్హుడివి, నా కొడుకు దొంగగా మారడం నాకు ఇష్టం లేదు." అంది అమ్మ.
"నువ్వు నాతో రా అమ్మ. నేను ఒంటరిగా తిరిగి వెళ్ళడానికి భయంగా వుంది" అన్నాడు.
"మరి దొంగతనం చేసినప్పుడు భయం కలగలేదా?" అంది అమ్మ.
రెండు పెద్ద దోసకాయలను అతని చేతుల్లో పెట్టి, అతన్ని ఇంటి నుండి బయటకు పంపించింది. "వెళ్లు, వాటిని తిరిగి ఇచ్చెయ్యి" అంది ఆమె.
కొల్యా గ్రామ వీధిలోకి వెళ్లాడు.

"వీటిని నేను గుంటలో పడేస్తే, అప్పుడు ఎవరైనా చూస్తే, నేను, ముసలాయన ఇద్దరం ఇబ్బందుల్లో పడతాము. పావ్లిక్ తెలివిగా తను దొంగిలించిన కీరా దోసకాయల్ని కూడా నాకు అంటకట్టి, వాడు తప్పించుకున్నాడు" ఇలా తనలో తాను గొణుక్కుంటున్నాడు.

నడవగా, నడవగా గ్రామ శివారుకు వచ్చాడు. అక్కడ వున్న పొలం మీదుగా నడుస్తున్నాడు. అతను ఇంత ఆలస్యంగా ఎప్పుడూ బయటికి రాలేదు, అది అతనికి అసహానంగా అనిపించింది. చివరికి అతను నది ఒడ్డున ఉన్న కీరా దోసకాయ పొలం వద్దకు చేరుకున్నాడు.

అక్కడ కీర దోసకాయ పొలం అంచున చిన్న గుడిసె వుంది.

తోట కాపలాదారుడు అక్కడ కూర్చునివున్నాడు.
కొల్యా గుడిసె బయట నిలబడి ముక్కును ఎగ పీల్చాడు.
కాపలాదారుడు ఇతని శబ్దం విన్నాడు.
"ఏంటి విషయం?" బయటికి వస్తూ అన్నాడు.
"కీరా దోసకాయలు తిరిగి ఇవ్వటానికి వచ్చాను" అన్నాడు కోల్యా.
"ఏం కీరా దోసకాయలు?"
"నేను, నా స్నేహితుడు పావ్లిక్ మీ పొలం నుండి కొన్ని కీరా దోసకాయలు దొంగిలించి పారిపోయాము. మా అమ్మ వాటిని తిరిగి మీకు అప్పగించమని నన్ను పంపింది"

"ఓ, అప్పుడు నేను పికిలీ ఊదినప్పుడు పారిపోయింది మీరేనా? వీటిని తిరిగి తెచ్చినందుకు ధన్యవాదాలు" అన్నాడు ముసలాయన.

కోల్యా తన జోబులోని, చొక్కాలోని, చేతుల్లోని కీరా దోసకాయల్ని అక్కడ కుప్పగా పోసాడు. ముసలాయనకు క్షమాపణ చెప్పాడు.

"మరి నేను ఒక కీరా దోసకాయను తినేశాను, అదిప్పుడు నా పొట్టలో వుంది. మరి నేను ఇప్పుడు దొంగనా? కాదా?" అని అమాయకంగా అడిగాడు కోల్యా.

"ఇంకోసారి ఇలా ఎప్పుడూ చెయ్యకు. నువ్వు దొంగవి కాదు, నువ్వు తిన్న కీరా దోసకాయ నేను నీకు బహుమతిగా ఇచ్చాను అనుకో" అన్నాడు ముసలాయన.

పిల్లాడు ఆనందంగా గెంతుతూ ఇంటిదారి పట్టాడు.